క్లుప్తంగా

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని శ్రీ జిహ్వేశ్వర విద్యాలయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు భగవద్గీత జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని పాఠశాల సెక్రటరీ ఎస్.నాగరాజు, హెచ్‌ఎం సంగీత తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ.. గ్రూప్–ఏలో సెకండ్ ప్రైజ్ ఎం.నేహా, గ్రూప్–బీలో సెకండ్ ప్రైజ్ వై.తనీష్, గ్రూప్–సీలో సెకండ్ ప్రైజ్ బి.మోక్షశ్రీ, గ్రూప్–డీలో కన్సోలేషన్ ప్రైజ్ కె.అమృతసాయి, గ్రూప్–ఈలో కన్సోలేషన్ ప్రైజ్ కె.ఎస్.ప్రవీణ గెలుపొందారని చెప్పారు.

తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



వరి నూర్పిడిని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్

పెద్దకడబూరు : మిచౌంగ్ తుపాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ సూచించారు. సోమవారం వరి పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ నేడు, రేపు కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వరిలో గింజ గట్టిపడి కోతకు సిద్ధంగా ఉంటే వెంటనే యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. వీలు కాకపోతే తగినన్ని టార్పాలిన్, పాలిథిన్ పట్టలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పంటను కోసి పొలాల్లో ఉంచిన వారు వాటిని కుప్పలుగా వేసి వర్షం నుంచి కాపాడుకోవాలన్నారు. కుప్పల్లో మొలకలు రాకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని చెప్పారు. అలాగే పత్తి, మిరప పంటల్లో వర్షపు నీరు నిలువకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

ఘంటసాలకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సప్త స్వరాల కళా సమితి సభ్యులు

ఆదోనిరూరల్: గాన గంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతిని సోమవారం ఘంటసాల సప్తస్వరాల కళాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సమితి గౌరవాధ్యక్షుడు టి.ఆంజనేయులు, అధ్యక్షులు బి.నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి బసవరాజ్‌స్వామి, ఉపాధ్యక్షుడు సాకరే మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఘంటసాల 1922 డిసెంబర్ 4న చౌటుపల్లిలో జన్మించారన్నారు. ఆయన శాస్త్రీయ సంగీత పాటలు నేటికీ శ్రోతల మనసులో చెరగని స్థానం సంపాదించాయని కొనియాడారు. ఆయన గానం చేసిన భగవద్గీతకు నేటికి ఆదరణ తగ్గలేదంటే అతిశయోక్తి కాదన్నారు. సభ్యులు గురుదేశ్‌స్వామి, గుడేకల్ కుమార్‌స్వామి, రామన్నయాదవ్, మద్దిలేటి, నగేష్, హనుమంతు, ఈరన్న పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: పట్టణానికి చెందిన పది మంది క్షయ వ్యాధిగ్రస్తులను వ్యాపారవేత్త విట్టారమేష్ ఆరు నెలల క్రితం దత్తత తీసుకున్నారు. వారికి ప్రతి నెలా పోషకాహారంతో పాటు మందులు ఉచితంగా అందజేస్తారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీపీసీ సెంటర్‌లో ఈ నెల కోటాకు సంబంధించి కిట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ షేకున్‌భాను, ఎంపీహెచ్‌ఎస్ బాబురాజు మాట్లాడుతూ దాతల సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులు, పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు. ఎంపీహెచ్‌ఎస్ లలితమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: కోసిగి గ్రామానికి చెందిన నాటగాని కృష్ణ అనే వ్యక్తి అక్రమంగా బైకుపై కర్ణాటక మద్యం తరలిస్తుండగా పెద్దతుంబళం గ్రామ పరిధిలోని కోసిగి క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ చిన్నపీరయ్య సోమవారం తెలిపారు. నిందితుడి నుంచి నాలుగు బాక్సుల కర్ణాటక మద్యం (90 ఎం.ఎల్.టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకొని, బైకును సీజ్ చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



కర్నూలులో చికిత్స పొందుతున్న కొన్నం నరసప్పకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ ఉష



కర్నూలులో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నజీర్‌అహ్మద్‌కు వలంటీర్ శ్రీలేఖ పింఛన్ ఇస్తున్న దృశ్యం



కర్నూలు ఆసుపత్రిలో ఏకాంబరప్ప నుంచి వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ నందిని

ఆపదలో ఉన్నారని..

- వ్యాధులతో ఆసుత్రిల్లో లబ్ధిదారులు
- అక్కడికే వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్లు

ఆదోనిటౌన్: పట్టణంలో నివాసముంటూ వివిధ వ్యాధులతో బాధపడుతూ కర్నూలులోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ముగ్గురికి వలంటీర్లు సోమవారం పింఛన్ అందజేశారు. 24వ వార్డు క్రాంతినగర్‌లో నివాసముంటున్న కొన్నం నరసప్ప బ్రెయిన్‌స్ట్రోక్‌తో చికిత్స పొందుతుండగా వలంటీర్ ఉష కర్నూలుకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. అలాగే..27వ వార్డులో నివసిస్తున్న షేక్ నజీర్‌అహ్మద్ కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా. వలంటీర్ శ్రీలేఖ అక్కడి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేసింది. 10వ వార్డు పరిధిలోని దివ్యాంగుడు ఏకాంబరప్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలుసుకొని వలంటీర్ నందిని పింఛన్ అక్కడికే వెళ్లి అందజేసింది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

ఆదోనిఅర్బన్: హక్కుల సాధనకు దివ్యాంగులు ఐక్యంగా పోరాడాలని అమ్మ దివ్యాంగుల సేవా జిల్లా అధ్యక్షుడు కె.ఈరన్న, ఆదోని డివిజన్ అధ్యక్షుడు కమతం వెంకటేష్ పిలుపునిచ్చారు. వికలాంగుల హక్కుల పోరుబాట ప్రచార రథం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని దొడ్డనగేరి, నెమలికల్లు, కొత్తూరు, మాంత్రికి, పెద్దతుంబళంలో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని దివ్యాంగులతో చర్చించి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. యాత్రను శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆదోని మున్సిపల్ స్కూల్‌లో ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఆదోని నుంచి ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు మీదుగా కర్నూలుకు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. షబ్బీర్, సూర్య, రఫిక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సారథి జగనన్న



ఆరేకల్‌లో సంక్షేమ పథకాలను లబ్ధిదారుకు వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: సంక్షేమ పథకాల సారథి జగనన్న అని, గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్య పడిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆరేకల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గృహాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు అందుతున్నాయా, ఏవైనా సమస్యలున్నాయ అంటూ ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.13,26,78,000 నేరుగా వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20 లక్షలతో సీసీ రోడ్లు వేయించామని, రూ.17 లక్షలతో పాల కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జలజీవన్ యోజన పథకం ద్వారా తాగునీరు పైపులైన్ వేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా 25 విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించామన్నారు. గ్రామంలో సచివాలయం రూ.40 లక్షలతో, రైతు భరోసా కేంద్రం రూ.30 లక్షలతో ప్రారంచామని, ఇంత అభివృద్ధి చేస్తున్నా ప్రతిపక్షాలు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నాగమల్లయ్య, రమేష్, సర్పంచ్ లోహిత వీరస్వామి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, విద్యుత్‌శాఖ అధికారి చెన్నయ్య, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి, మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, సర్పంచ్ గొల్లరవి, నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, దేవదాసు, రాముడు, నాగరాజు, రామిరెడ్డి, వీరప్ప, జెల్లీ గోపాల్, ప్రకాష్, నాగిరెడ్డి, కల్పవల్లి, పూజారి నాగన్న, నరసింహా, శంకర్, చిన్నఈరన్న పాల్గొన్నారు.

పేదలకు భూ పట్టాల పంపిణీ



పేదలకు భూపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి

కోసిగి: పేద ప్రజలకు శాశ్వత భూయాజమాన్య హక్కు పత్రాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాంపురం గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో.. కోసిగి మండలంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కు పత్రాలను వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోసిగి మండలంలోని దాదాపు 170.90 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 144 మంది రైతులకు ఉచితంగా అప్పగించామన్నారు. రెవెన్యూ శాఖ పరంగా ఆ రైతులు భూమిపై సర్వహక్కులు కలిగి ఉంటారన్నారు. మండలంలోని ఆర్లబండ గ్రామానికి చెందిన 44 మంది రైతులకు 57.09 ఎకరాలు, కందుకూరు గ్రామానికి చెందిన 45 మంది రైతులకు 44.31 ఎకరాలు, భూంపల్లి గ్రామానికి చెందిన 35 మందికి 17.50ఎకరాలతో పాటు మరో 20 మందికి వివిధ గ్రామాలకు చెందిన రైతులకు పట్టాలు అందజేశారు. భూ హక్కులు కల్పించడంపై పట్టాల పొందిన రైతులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలు శిక్ష

దేవనకొండ: మండలంలోని మాచాపురం గ్రామానికి చెందిన ఉప్పరి బజారి, ఉప్పరి వెంకటేష్‌లకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ పత్తికొండ మెజిస్ట్రేట్ దివ్య ఉత్తర్వులు జారీ చేశారని ఎస్‌ఐ భూపాలుడు సోమవారం తెలిపారు. 2016 జనవరి 4న గ్రామానికి చెందిన ఉప్పరి దానమ్మ పొలంలో పనిచేసుకుంటుండగా బజారి, వెంకటేష్ అసభ్యంగా తిట్టి, కొట్టారని బాధితురాలు దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నేరం రుజువు కావడంతో నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి చేయూత



ఎస్‌ఎంఎల్ డిగ్రీ కళాశాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వై.సీతారామిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమ వంతు చేయూతనందిస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల ప్రధాన ద్వారం నుంచి అడ్మినిస్ట్రేటివ్ భవనం వరకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, హనుమాపురం గ్రామ సర్పంచ్ పూజారి ఈరన్న, తదితరులతో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కళాశాలల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని, ఏమైనా సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మూకయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు,దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవాడానికి వేలాదిగా తరలివచ్చారు. దీంతో క్షేత్రం కిటకిటలాడింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. పలువురు కేదారస్వామి, గౌరీ నోములు నోచుకోగా, పలువురు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు బందబస్తు ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



స్పందనలో ప్రజల సమస్యలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి తక్షణమే సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేసి వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీయల్‌డీఓ నాగేశ్వరరావు, డీయల్‌పీఓ శ్రీనివాసులు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కె.లక్ష్మినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఉప తహసీల్దార్‌లు వలీబాషా, కౌసర్‌బాను పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

- తనకు వివాహమై నాలుగేళ్లు పూర్తయ్యిందని, అయినా మా అమ్మగారి రేషన్‌కార్డులో ఉన్నానని, తన కుటుంబానికి కొత్త బియ్యం కార్డు మంజూరు చేయాలని ఆదోని పట్టణం 6వ వార్డుకు చెందిన వీరాంజనేయులు అర్జీ అందజేశారు.
- హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన సుభాషిణికి సర్వే నంబర్ 134/ఏలో 2.37 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆన్‌లైన్ అడంగల్‌లో వేరే వారి పేరుతో నమోదైందని, విచారణ చేసి తన పేరు నమోదు చేయాలని వినతి పత్రం ఇచ్చారు.
- ఎమ్మిగనూరు మండలం రామయ్య కొట్టాల వీధికి చెందిన నరసన్నకు సర్వే నంబర్ 145లో 2.07 ఎకరాలు, సర్వే నంబర్ 146లో 0.95 ఎకరాలు, సర్వే నంబర్ 148/సీలో 4.90 ఎకరాలు మొత్తం 7.92 ఎకరాల భూమి జిల్లా కోర్టులో విచారణలో ఉందని, ఈ భూమిని డిస్ప్యూట్‌లో నమోదు చేయాలని విన్నవించారు.
- గ్రామంలో దళితుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించారని, అయితే ఆ స్థలం అనువుగా లేనందున మరొక స్థలం కేటాయించాలని గోనెగండ్ల మండలం అగ్రహారానికి చెందిన రంగముని, గోపాల్ తదితరులు అర్జీ సమర్పించారు.

సంక్షేమాభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ జగనన్న






సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, హాల్విలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన దృశ్యం


ఆదోనిటౌన్: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేరాఫ్ అడ్రస్ జగనన్నేనని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 6వ వార్డు ఎన్‌జీవోస్ కాలనీ, 19వ వార్డు ఆర్టీసీ కాలనీలో వార్డు, సచివాలయాల పరిధిలో జెండా ఆవిష్కరణ, డిస్‌ప్లే బోర్డు ప్రదర్శన నిర్వహించారు. దేవా, 6వ వార్డు ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి, 18వ వార్డు కౌన్సిలర్ చలపతి, క్లస్టర్–1 అధ్యక్షుడు మహ్మద్‌స్వామి మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి గడపకూ లబ్ధి చేకూరిందని చెప్పారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మొండిచేయి చూపారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేస్తామని నమ్మబలికి నట్టేట ముంచారని గుర్తు చేశారు. కౌన్సిలర్ సునీతా రెడ్డి, మహాలక్ష్మి, 19వ వార్డు ఇన్‌చార్జి మధు, వెంకటేష్, నాయకులు ధర్మ, రమేష్, అంజి, గంజిలయ్య, చక్రి, దినేష్, చిరంజీవి, ప్రణీత్, రమేష్, నాని, సింగ్, తాయన్న పాల్గొన్నారు.

కోసిగి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారని జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కందుకూరు గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామ ప్రధాన రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ జెండాలతో సచివాలయ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. అనంతరం వలంటీర్లకు అవగాహన కల్పించి బుక్‌లెట్స్‌ను పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, నాయకులు కామన్‌దొడ్డి నరసింహులు గౌడ, తాయన్న, మల్లయ్య, వీరయ్య గౌడ్, భీంరెడ్డి, దేవేంద్ర, నబిరసూల్, రాఘవరెడ్డి, కడదొడ్డి సర్పంచ్ ఉసేని, తిక్కయ్య, ఆదెప్ప పాల్గొన్నారు.


కౌతాళం: ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి మరోసారి రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని జెడ్పీటీసీ రాధాప్రియదర్శిని, హాల్వి గ్రామ సర్పంచ్ క్రాంతి పేర్కొన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన సోమవారం మండలంలోని హాల్వి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నాల్గున్నర సంవత్సరాలలో గ్రామంలో రూ.30 కోట్లు సంక్షేమాభివృద్ధికి వెచ్చించారని చెప్పారు. కార్యదర్శి అబ్దుల్‌కరీం, నాయకులు సాధిక్, సిద్దనగౌడ్, హనుమంతు పాల్గొన్నారు.



ఆర్టీసీ కాలనీలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



6వ వార్డులో అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన వైసీపీ నాయకులు



ఎన్‌జీవోస్ కాలనీలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వార్డు ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి

పత్తికి మద్దతు పెంచాలి

ఆదోనిరూరల్: పత్తి దిగుబడికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర రూ.10వేలకు పెంచాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి ధరలను పరిశీలించారు. సంఘం ఆదోని మండల కార్యదర్శి అయ్యప్ప మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావం కారణంగా దిగుబడి భారీగా పడిపోయిందని, చివరకు కూలీల ఖర్చులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక వ్యాపారులు రైతులు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ క్వింటా రూ.4వేల నుంచి రూ.6వేల వరకు మాత్రమే కొంటున్నారని చెప్పారు. ఒకరిద్దరికి మాత్రమే రూ.7వేల ప్రకారం చెల్లిస్తున్నారన్నారు. కౌతాళం మండల నాయకుడు హనుమంతు, కోసిగి మండల నాయకుడు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ అద్దె బస్సు సౌకర్యం

ఎమ్మిగనూరుటౌన్: శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి అద్దె ప్రాతిపదికన బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు డిపో మేనేజర్ అమర్నాథ్, అసిస్టెంట్ మేనేజర్ జివి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక డిపోలో కరపత్రాలను విడుదల చేశారు. సూపర్ లగ్జరీ బస్సు కిలోమీటర్‌కు రూ.57, అల్ట్రా డీలక్స్ కిలోమీటర్‌కు రూ.61, ఎక్స్‌ప్రెస్ బస్సు కిలోమీటర్‌కు రూ.62 ప్రకారం అద్దె వసూలు చేయనున్నట్లు చెప్పారు. వీటిపై ఎలాంటి ఆర్టీఓ పన్నులుండవని, రోజువారీ అద్దె 420 కిలోమీటర్ల మేర లెక్కించడం జరుగుతుందన్నారు. బస్సు బుక్ చేసిన గురుస్వామి, ఏటీటీ ఏజెంట్‌కు రూ.2 వేల ప్రోత్సాహకం అందిస్తామని, బస్సులో వంట మనిషి, ఇద్దరు కన్నె స్వాములకు ఉచితంగా సీటు కల్పించనున్నట్లు తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని డీఎస్పీ బంగ్లా సమీపంలోనున్న భాష్యం పాఠశాల విద్యార్థులు సౌత్ ఇండియన్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపారు. ఇందులో నలుగురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, బ్రౌంజ్ మెడల్స్ ఏడుగురికి లభించాయని సీఈఓ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. గోల్డ్‌మెడల్ సాధించిన వారిలో మదన్, విజయ్‌కుమార్, ఎం.పి.శ్రీ , రఘు, బ్రౌంజ్ మెడల్స్ సాధించిన వారిలో షేక్షావలి, సాయికిషోర్, పింటు, బృందకిషన్, అఖిల్, సాయిభార్గవ్, వివేక్ ఉన్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ సురేంద్రబాబుతో కలిసి విద్యార్థులు, కేశవ మాస్టర్‌ను అభినందించారు.